
# సైన్స్ ఫెయిర్‌కు సన్నద్ధం



## ఈ నెల మూడో వారంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు

**విజ్ఞాన శాస్త్రం - సాంకేతిక అభివృద్ధిపై ప్రాజెక్టులకు అవకాశం**

**వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు**

**ఈ నెల 20 వరకు విద్యార్థుల ప్రాజెక్టుల నమోదుకు గడువు**

**అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులను సిద్ధం చేయాలని డీఈఓ పిలుపు**



సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థి ఎగ్జిబిట్ ప్రదర్శన (ఫైల్)

విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్ర సాంకేతిక (విజ్ఞాన, గణితశాస్త్ర) నైపుణ్యాలను వెలికితీసి వారి ప్రతిభకు పదునుపెట్టే జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు జిల్లా విద్యాశాఖ సన్నద్ధమైంది. సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ అనే ప్రధాన అంశంతోపాటు ఇన్‌స్పైర్ మానక్ అవార్డుల (2022-23)కు ఎంపికైన ప్రాజెక్టులతో డిసెంబర్ మూడో వారంలో నిర్వహించనున్నారు. ప్రదర్శనకు సూచించిన అంశాల్లో వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల సైన్స్, గణిత ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్యం చేసి నూతన ప్రాజెక్టులను తయారు చేయించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.భిక్షపతి పిలుపునిచ్చారు. – రామగిరి, డిసెంబర్ 5

జిల్లా స్థాయి 'రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శిణి' (ఆర్ఎస్‌బీవీపీ) పేరుతో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ వైజ్ఞానిక గణిత – పర్యావరణ ప్రదర్శనను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. ఇందులో భాగంగా 'సమాజం కొరకు సైన్స్ అండ్ టెక్నాలజీ' పేరుతో విద్యార్థులు పలు ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శనకు తీసుకొచ్చే విధంగా జిల్లాలోని సమస్త యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సిద్ధం కావాలని సూచించింది. జిల్లా స్థాయి ప్రదర్శనలో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపిస్తారు. వైజ్ఞానిక ప్రదర్శన చైర్మన్‌గా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ వ్యవహరించనుండగా.. మెంబర్ కన్వీనర్‌గా డీఈఓ, సభ్యులుగా డైట్ ప్రిన్సిపాల్, జిల్లా సైన్స్ అధికారితోపాటు పలువురు కమిటీలో ఉంటారు.

### 101 ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన..

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఆయా ఉప అంశాల్లో ప్రాజెక్టుల ప్రదర్శన ఉంటుంది. వీటితో పాటు 2022-23 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మానక్ అవార్డు, జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన 101 ప్రాజెక్టుల ప్రదర్శన కూడా ఉంటుంది. దీంతో ఉత్తమమైన సైన్స్ వాతావరణం జిల్లాలో నిర్వహించే సైన్స్ ఫెయిర్‌లో దర్శనమివ్వనున్నదని చెప్పొచ్చు.

### శాస్త్ర సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికే..

విద్యతోపాటు విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక అంశాల్లోని నైపుణ్యాలను వెలికితీసి వారి ప్రతిభకు పదునుపెట్టి అభివృద్ధి చేసేందుకే సమస్త యాజమాన్యాల పాఠశాలలు, విద్యా శిక్షణ కళాశాలల్లోని విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తారు. సూచించిన ప్రధానాంశంలోని ఉప అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులను తీసుకొచ్చి ప్రదర్శించాల్సి ఉంటుంది. పాఠశాల దశ నుంచి సైన్స్, గణితం సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా విద్యార్థులను తయారు చేయడంలో ఈ ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని విద్యా, సైన్స్ నిపుణులు సూచిస్తున్నారు.

### ప్రదర్శనలోని అంశాలు..

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రధానాంశం 'సమాజం కొరకు సైన్స్ అండ్ టెక్నాలజీ). ఇందులో ఉండే ఉప అంశాలు ఇవి.

1. ఆరోగ్యం
2. జీవితం (పర్యావరణానికి జీవన శైలి)
3. వ్యవసాయం
4. సమాచారం అండ్ రవాణా
5. కంప్యూటేషనల్ థింకింగ్



ఈ విభాగాల్లో ఉత్తమంగా (ప్రథమ స్థానం సాధించిన) నిలిచిన ప్రదర్శనల్లో జూనియర్స్ నుంచి 5, సీనియర్స్ నుంచి ఐదింటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. ముఖ్యంగా ఆయా అంశాల్లో వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యత ఉంటుంది. అదేవిధంగా విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ జరిగే రోజుల్లో వివిధ అంశాల్లో సెమినార్లు, వ్యాసరచన పోటీలు సైతం ఉంటాయని సంబంధిత అధికారులు తెలిపారు.

### ప్రదర్శనలో పాల్గొనేందుకు వీరికే అవకాశం

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేందుకు సమస్త యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 6నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు అవకాశం ఉన్నది. విద్యార్థులను ఆయా పాఠశాలల సైన్స్, గణిత ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సి ఉంటుంది. వీరితోపాటు జిల్లాలోని డీఈడీ, బీఈడీ కళాశాలల్లో ఛాత్రోపాధ్యాయులు నూతన బోధనా సామగ్రిని ప్రదర్శించవచ్చు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సైతం నూతన బోధన ఆవిష్కరణలు ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది. కాగా, ప్రదర్శనలో పాల్గొనే పాఠశాలలు, విద్యార్థులు, ఛాత్రోపాధ్యాయుల వివరాలను ఈ నెల 20న సాయంత్రం 5గంటల లోపు https://forms.gle/vq7DNUnWeFccpQqo6 లింక్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల తయారీలో ఆయా విద్యాసంస్థల గణితం, సైన్స్ ఉపాధ్యాయులు గైడ్ టీచర్లుగా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉన్నది.

### సైన్స్, గణితంపై ఆసక్తిని పెంచే మార్గం



పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంచేందుకు సైన్స్, గణితం అంశాల్లో ఉత్తమ ప్రాజెక్టుల నిర్వహణకు విద్యాశాఖ నిర్వహించే సైన్స్‌ఫెయిర్ ఎంతో దోహదం చేస్తుంది. అన్ని పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ విద్యార్థులను జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలోని ఉప అంశాల వారీగా ప్రాజెక్టులను తయారు చేసేలా ప్రోత్సహించాలి. ప్రతి పాఠశాల నుంచి జూనియర్స్, సీనియర్స్ విభాగంలో ప్రాజెక్టులతో పాల్గొనేలా చూడాలి. ఇది విద్యార్థుల్లో ఆసక్తిని పెంచడానికి చక్కటి మార్గం. ఏమైనా సందేహాలు, సలహాలు ఉంటే 9848578845లో సంప్రదించాలి.

– వనం లక్ష్మీపతి, జిల్లా సైన్స్ అధికారి, నల్లగొండ

### ఉత్తమమైన ప్రాజెక్టుల కోసం విద్యార్థులను ప్రోత్సహించాలి



రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి వైజ్ఞానిక గణిత ప్రదర్శన ఈ నెల మూడో వారంలో నిర్వహించేందుకు సిద్ధమయ్యాం. ఆ దిశగా అందరి సహకారంతో ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో 6నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేసి తీసుకొచ్చే విధంగా ఆయా పాఠశాలల సైన్స్, గణిత ఉపాధ్యాయులు కృషి చేయాలి. 5 ఉప అంశాల్లో ఉత్తమమైన అధిక ప్రాజెక్టులు వచ్చేవిధంగా, వాటిలో వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యత ఇచ్చేలా ఉపాధ్యాయులు చూడాలి. సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయడానికి అన్ని మండలాల ఎంఈఓలు, కాంప్లెక్స్ స్కూల్స్ హెచ్‌ఎంలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకారం అందించి ప్రాజెక్టులు ఎక్కువ వచ్చేలా చూడాలి. వీటితోపాటు ఇన్‌స్పైర్ మానక్ – 2022-23కు ఎంపికైన 101 ప్రాజెక్టుల ప్రదర్శన సైతం జరుగుతుంది. మన జిల్లా విద్యార్థులు ఆ ప్రాజెక్టులతో రాష్ట్ర, జాతీయ స్థాయికి వెళ్లి జిల్లా ఖ్యాతిని చాటేలా చూడాలి. విద్యార్థుల శాస్త్రీయ నైపుణ్యాలకు పదును పెట్టాలనేది మా సంకల్పం.

– బి.భిక్షపతి, నల్లగొండ డీఈఓ



# పచ్చని పరిశ్రమల దండు

## ఉపాధికి భరోసా.. పరిశ్రమలకు చేయూత

**కొలువుల కార్ఖానగా దండు మల్కాపురం గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు**

**నాడు డంప్ యార్డ్ చేసేందుకు కాంగ్రెస్ యత్నం**

**నేడు ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ**

**1,857 ఎకరాల్లో పార్కు.. 150కి పైగా పరిశ్రమలు**

**నిర్మాణ దశలో మరో 250 పరిశ్రమలు**

**పెరిగిన భూముల రేట్లు.. తగ్గిన వలసలు**



గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు పైలాన్




దండు మల్కాపురం ఇండస్ట్రియల్ పార్కులో ఎంఎస్ఎంఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన సముదాయం

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రోళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లోనూ వెనుకబాటే ఉండేది. చిన్నాచితకా పరిశ్రమలు కూడా మన దగ్గరకు రాకుండా తరలించుకుపోయేటోళ్లు. మనోళ్లు పెడుదామంటే అనేక కొర్రీలు పెట్టి అడ్డుకునేటోళ్లు. ఇదిలాఉండగా, సమైక్య పాలనలో గత కాంగ్రెస్ ప్రభుత్వం చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలోని రాచకొండ గుట్టల ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి ధ్వంసం చేయడానికి ప్రయత్నాలు చేసింది. కానీ.. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అదే ప్రాంతంలో ఉద్యోగాలు సృష్టించే ఎంఎస్ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసింది. ఇప్పుడది ప్రపంచ స్థాయి గుర్తింపుతో కొలువుల కార్ఖానగా మారింది. మొత్తం 1,857 ఎకరాల్లో పార్కును విస్తరించగా.. ఇక్కడ కాలుష్యానికి ఇబ్బంది లేని పరిశ్రమలకు మాత్రమే అనుమతులు ఇస్తారు. ఆసియాలోనే పెద్ద పారిశ్రామిక వాడ అయిన ఈ పార్కులో పెద్ద సంఖ్యలో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు క్యూ కడుతున్నారు. మొదటి దశలో కేసీఆర్ సర్కారు 547 ఎకరాల్లో 589 పరిశ్రమల ఏర్పాటుకు భూ కేటాయింపు చేసింది. సింగిల్‌విండో విధానంలో అనుమతులు ఇచ్చి, పార్కులో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించింది. పార్కులో ఇప్పటి దాకా 150కి పైగా పరిశ్రమలు ఏర్పాటై తమ ఉత్పత్తులు ప్రారంభించాయి. మరో 250 పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇటీవల ఒక్కరోజే అప్పటి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా 51 పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు.

### భారీగా ఉపాధి అవకాశాలు

పార్కులో పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలి రావడంతో ఉపాధి అవకాశాలు పెరిగాయి. 75శాతం ఉద్యోగాలు స్థానికులకు అందేలా నిబంధనలు తీసుకొచ్చారు. దీంతో ఈ ప్రాంతంలోని ఇంజినీరింగ్, ఐటీఐ, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్నికల్ తదితర కోర్సుల్లో నైపుణ్యం ఉన్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అందుతున్నాయి. పార్కులో పూర్తిస్థాయి పరిశ్రమలు ఏర్పాటైతే 45వేల మందికి ప్రత్యేకంగా ఉద్యోగాలు దొరుకనున్నాయి. చౌటుప్పల్‌తోపాటు చిట్యాల, సంస్థాన్ నారాయణపురం, పోచంపల్లి, రామన్నపేట, నార్కట్‌పల్లి, బీబీనగర్ తదితర మండలాలకు చెందిన యువతకు ఉపాధి దొరుకనుంది.

### పెరిగిన భూముల రేట్లు.. తగ్గిన వలసలు

పార్కులో పరిశ్రమలు నెలకొల్పుతుండటంతో ఉపాధికి కొదవ లేదు. దీంతో ఇతర ప్రాంతాలకు వలసలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇప్పటికే దండు మల్కాపురంలో రోజుకు సుమారు ఐదు వేల మంది దాకా పని చేస్తున్నారు. మహిళలకు సైతం మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇక పరిశ్రమలు పూర్తి స్థాయిలో ప్రారంభిస్తే వలసలు ఆగిపోనున్నాయి. సొంత ఇలాఖాలోనే, ఇంటి పట్టున ఉపాధి దొరుకుతుండటంతో అంతా ఇక్కడే ఉండి ఏంచక్కా ఆనందంగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మరోవైపు ఈ పరిసర ప్రాంతాల్లో భూముల రేట్లు మరింత పెరిగాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చాక పెద్ద ఎత్తున ధరలు పెరగ్గా.. పార్కు ఏర్పాటుతో రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. ఎకరం భూమి కోట్లలో పలుకుతుండటం గమనార్హం.

### పార్కులోని పరిశ్రమలివే..

దండు మల్కాపురం పార్కులో ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్, ఎర్త్ డ్రిల్లింగ్‌కు సంబంధించిన ఉత్పాదక యూనిట్, అట్టపెట్టెల తయారీ, బ్రిక్స్, పోల్స్ తదితర సిమెంట్ బిల్డింగ్ మెటీరియల్, ఎలక్ట్రికల్ టూ వీలర్, త్రీ వీలర్ తయారీ పరిశ్రమలు ఉన్నాయి. రూ.156 కోట్లతో టాయ్స్ పార్కు ఏర్పాటుకు కేటీఆర్ కొద్ది రోజుల క్రితం శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 106 ఎకరాల భూమిని కేటాయించగా.. దాన్ని 196 ప్లాట్లుగా విభజించి యూనిట్లు నెలకొల్పనున్నారు. ఇది పూర్తయితే సుమారు 10వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంలో బొమ్మలు తయారైతే చైనా నుంచి దిగుమతులు తగ్గించేందుకు ఆస్కారం ఉంటుంది.

### రూ.41కోట్లతో కామన్ ఫెసిలిటీ సెంటర్

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో కామన్ ఫెసిలిటీ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. 5ఎకరాల స్థలంలో సుమారు రూ.41కోట్లతో ఈ కేంద్రానికి 2021 జనవరి 22న శంకుస్థాపన చేశారు. ఏడాదిన్నరలోనే యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సెంటర్‌ను రెండు బ్లాక్‌లుగా నిర్మించారు. మొదటి బ్లాక్‌లో సమావేశ మందిరాలు, నైపుణ్య శిక్షణ కేంద్రం, ఆడిటోరియం, ఐలా, టిఫ్ కార్యాలయాలు, రెస్టారెంట్లు, బ్యాంకులను నిర్మించారు. రెండో బ్లాక్‌లో పార్కులో ఉత్పత్తి చేసిన పరిశ్రమల వస్తువులను ప్రదర్శించేందుకు ప్రత్యేక మార్కెట్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వివిధ విభాగాల నిపుణులకు కార్యాలయాలు, వసతి గదులు, ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేశారు.



గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు వ్యూ..

### స్థానికులకు ఉపాధి



గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో పూర్తి స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటైతే చాలా మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకనున్నది. ఇక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రకాలుగా మౌలిక సౌకర్యాలు కల్పించింది. దీంతో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వస్తున్నాయి. టెక్నికల్ కోర్సులు చేసిన విద్యార్థులకు ఇక్కడ మంచి అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్‌లో ఈ ప్రాంతం పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందనుంది.

– సోమనబోయిన కృష్ణకుమార్, ఉద్యోగి

# సరైన యాజమాన్యంతో వరిలో సిరుల పంటలు

## వరి నాట్లలో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు

### రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్న వ్యవసాయ నిపుణులు

నేరేడుచర్ల, డిసెంబర్ 5 : వానకాలం సీజన్ పంటల నూర్పిడి పూర్తి కావడంతో అన్నదాతలు యాసంగి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ముందస్తుగా వరి నార్లు పోసుకున్న రైతులు నాట్లు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. అయితే.. నాట్లు వేసేటప్పుడు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే సిరుల పంటలు పండించవచ్చని, లేదంటే దిగుబడులపై ప్రభావం పడే అవకాశముంటుందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో నాట్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేస్తున్నారు.



నేరేడుచర్ల మండలంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

### పొలం తయారీ ఇలా..

వరి నాట్లు వేయడానికి సుమారు 3వారాల ముందు నుంచే పొలాన్ని తయారు చేసుకోవాలి. ట్రాక్టర్ లేదా ఎడ్ల నాగలితో ఒక సాలు దున్నిన తర్వాత నాలుగైదు రోజులకు మరో సాలు దున్నాలి. దీని వల్ల కలుపు మొక్కలు భూమిలో కలిసిపోయి పంటకు ఉపయోగపడుతాయి. హడావుడిగా పొలాన్ని సిద్ధం చేస్తే కలుపు మొక్కలు ఎక్కువై పంట దిగుబడిని దెబ్బతీస్తాయి. పచ్చి రొట్ట పైర్లు భూమిలో కలువడానికి సుమారు రెండు వారాల సమయం పడుతుంది. కాబట్టి ఆ పైర్లను భూమిలో కలియదున్నేటప్పుడు ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ వేసుకోవాలి.

### నాట్లు వేసేటప్పుడు ఇవి పాటించాలి

పొలంలో నాటడానికి 4-6 ఆకులు కలిగిన వరి నారు అనుకూలం. బురద పదును ఉండేలా పొలాన్ని తయారు చేసుకొని 2-3 సెంటీ మీటర్ల లోతులో నాటితే మంచిది. ఎక్కువ లోతులో నాటితే పిలకలు రావడం ఆలస్యం అవుతుంది. పిలకల సంఖ్య తగ్గిపోతుంది. కుదురుకు 2-3 మొక్కలు కూడా నాటవచ్చు. నాటేటప్పుడు నారు తలలు తుంచితే మంచిది. సరైన వయసులో మొక్కలు నాటితే కొనలను కత్తిరించాల్సిన అవసరం ఉండదు. సాధారణంగా చదరపు మీటరుకు దీర్ఘకాలిక రకాలైతే 33 కుదుళ్లు, మధ్యకాలిక రకాలైతే 44, స్వల్పకాలిక రకాలైతే 50 కంటే ఎక్కువ కుదుళ్లు ఉండేలా చూసుకోవాలి. సాధ్యమైనంత వరకు లేత నారును నాటుకోవడం మంచిది.

### దుక్కిలోనే మొదటి దఫా ఎరువులు..

పొలాన్ని దున్నిన తర్వాత దమ్ము చేయాలి. బాగా దమ్ము చేస్తే నీటి వృథాను అరికట్టవచ్చు. కలుపు అదుపులో ఉంటుంది. పైరు అంతటికీ నీరు సమానంగా అందుతుంది. చివరి దమ్ములోనే ఆయా ప్రాంతాలకు అనుగుణంగా సిఫారసు చేసిన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను మొదటి దఫాగా వేసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలోనే వేసుకోవడం మంచిది. జింక్, భాస్వరం ఎరువులను ఒకేసారి వేయకుండా 2-3రోజుల తేడాతో వేసుకోవాలి. ప్రధాన పొలం గట్లపైన కలుపు మొక్కలు, గడ్డిని తీసివేయాలి.

### కాలి బాటలు తప్పనిసరి

నాట్లు వేసేటప్పుడు లేదా వేసిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున కాలిబాటలు తీస్తే పైరుకు కావాల్సిన గాలి, వెలుతురు లభిస్తాయి. చీడపీడల ఉధృతి కొంత వరకు తగ్గుతుంది. ఎరువులు వేయడం, చీడపీడలు, కలుపు నివారణకు మందులు పిచికారీ చేయడం, పైరు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించడం తేలికవుతుంది.

### నీటి యాజమాన్యం..

నీటి యాజమాన్యం విషయంలో తగిన జగ్రత్తలు తీసుకుంటే పిలకలు సకాలంలో వచ్చి దిగుబడి బాగా వస్తుంది. నాట్లు వేసిన నాటి నుంచి పైరు మూస తిరిగే వరకు అంటే 20 రోజుల పాటు పొలంలో పలుచగా నీరు ఉండాలి. పొలంలో నీరు తగిన మోతాదులో ఉంటే సుడి దోమ, లద్దె పురుగుల తాకిడి పెద్దగా ఉండదు. తడి ఆరిపోతే కలుపు మొక్కలు ఎక్కువగా వస్తాయి. రసాయన ఎరువులు వేసేటప్పుడు పొలంలో నీళ్లు తక్కువగా ఉండాలి.

### సరైన పద్ధతితో అధిక దిగుబడులు



వరి నారు పోసిన నాటి నుంచి కోత కోసే వరకు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన ఫలితాలు పొందవచ్చు. యాసంగిలో 25 రోజుల నుంచి 30 రోజుల వరి నారును నాటుకోవడం ఉత్తమం. నాటిన తరువాత పొలంలో ఉత్తర – దక్షిణ దిశలో కాలి బాటలను తీసుకోవాలి. వాటి వల్ల మొక్కలకు సరైన వెలుతురు, గాలి లభించడంతోపాటు ఎరువులు చల్లుకోవడానికి, మందులు పిచికారీ చేయడానికి వీలుగా ఉంటుంది. మొక్కల్లో రోగ లక్షణాలను గుర్తించి దానికి అనుగుణంగా తగిన మందులను సరైన మోతాదులో ఉదయం, సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలి. ఇలా చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– దొంగరి నరేశ్, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి